జూనియర్లకు పెద్దపీట.. సీనియర్లు రోడ్డుబాట..

- 990 రోజులు @ అటవీ కార్మికుల దీక్షలు
- టిటిడిలో వివక్షను పెంచి పోషిస్తున్న సిఎం, ఛైర్మన్

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు (పాతచిత్రం)

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిటిడి అటవీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఈనెల 27 నాటికి వెయ్యి రోజులకు చేరుకోనుంది. 'ధర్మాన్ని రక్షించండి.. ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది' అని నిత్యం ప్రచారం చేసే టిటిడిలో అధర్మం ఇష్టారాజ్యంగా రాజ్యమేలుతోంది.. తమకు నచ్చిన వారిని అందలమెక్కిస్తూ...ప్రశ్నించేవారిని పక్కనపెడుతూ టిటిడి ఉన్నతాధికారులు వివక్ష చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే జూనియర్లకు పెద్దపీట వేసి, సీనియర్లను రోడ్డుపాలు చేశారు. వెయ్యి రోజులకు నిరసన కార్యక్రమం చేరుకోనున్న నేపథ్యంలో సిఐటియు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. సిఎం, టిటిడి ఛైర్మన్లు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మరోమారు భారీ నిరసనలతో నిలదీయనున్నారు.

టిటిడి అటవీ విభాగంలో గత 30 ఏళ్లుగా 362 మంది పనిచేస్తున్నారు. అయితే వీరిలో జూనియర్లను పర్మినెంట్‌చేసి, సీనియర్లను వీధుల పాలు చేశారు. ముగ్గురు ఐఎఎస్ అధికారులు, ఒక ఐపిఎస్, అత్యున్నత వ్యక్తులతో నిండిన పాలకమండలి వెరసి అటవీ కార్మికుల గొంతు కోసింది. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుని హోదాలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు కావస్తున్నా, 990 రోజులుగా కార్మికులు రిలే దీక్షలు చేస్తూనే ఉన్నా వారి డిమాండ్లు పట్టించుకున్న పాపాన పోలేదు. టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి సైతం ఈవోగా బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే తిరుపతి పద్మావతి గెస్ట్‌హౌస్‌లో శాశ్వత ఉద్యోగులకు ఇళ్లస్థలాలు, అటవీ కార్మికుల క్రమబద్ధీకరణ చేయడమే తన పని అని అందరి సమక్షంలో చెప్పారు. అయితే 200 మంది కార్మికులను పర్మినెంట్ చేయకపోయినా ధర్మారెడ్డి ఇప్పటికీ వారి గోడు విన్న పాపాన పోలేదు. టిటిడి అటవీ విభాగంలోని 362 మంది కార్మికులకు టైంస్కేలు ఇస్తామని టిటిడి బోర్డు తీర్మానించింది. వీరిలో 162 మందిని పర్మినెంట్ చేశారు. మిగిలిన 200 మంది కార్మికులను టైంస్కేలు నుంచి కార్పొరేషన్‌లోకి రివర్షన్ చేస్తూ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కావడం లేదు. ఒకేచోట ఒకే పనిచేస్తున్న కార్మికుల పట్ల వివక్ష చూపడంపై సిఐటియు నిత్యం ప్రశ్నిస్తూనే ఉన్నా సమాధానం చెప్పే నాధుడే లేకపోవడం గమనార్హం. కేవలం సిఐటియు సంఘంలో ఉన్నారన్న కారణంగానే 200 మందిని రోడ్డుపాలు చేశారని గతంలోనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, పోలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, కందారపుమురళి సైతం నిలదీశారు. ఇప్పటికైనా సిఎం జగన్మోహన్‌రెడ్డి, ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డిలు టిటిడి అటవీ కార్మికుల నిరసన రాష్ట్రవ్యాప్తం కాకముందే నిర్లక్ష్యం వీడి 200 మంది కార్మికులను పర్మినెంట్ చేయాల్సి ఉంది. లేదంటే రోడ్డుపైన నిరసన గళం, కోర్టులో న్యాయ పోరాటం చేస్తామని అటవీ కార్మికుల యూనియన్ నేతలు ఉద్ఘాటిస్తున్నారు.

27న రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఉద్యోగ భద్రత కల్పించాలని టిటిడి అటవీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఈనెల 27 నాటికి వెయ్యి రోజులకు చేరుకోనున్న నేపథ్యంలో సంఘీభావంగా రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిఐటియు పిలుపునిచ్చింది. టిటిడి అటవీ కార్మికులు చేపట్టిన రిలే దీక్ష వెయ్యి రోజులకు చేరుకోనున్న సందర్భంగా గురువారం సిఐటియుకు అనుబంధంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు నిరసన తెలపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పిలుపునిచ్చారు. ఈనెల 20 నుంచి ప్రతిరోజూ పత్రికా ప్రకటనలు, సంఘీభావ ప్రకటనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాలను అన్ని మండలాల్లో చేపట్టాలన్నారు. కార్మికుల కుటుంబాలకు స్వాంతన చేకూరడానికి, వారి ఉద్యమానికి నమ్మకం కలిగించడానికి యూనియన్ల వారీగా కార్మికుల నుంచి వీలైన మేరకు ఎవరికి తోచిన విధంగా వారు విరాళాలు ఇచ్చి సంఘీభావం ప్రకటించాలని కోరారు. తిరుపతి నగరంలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులోని ఫారెస్టు కార్మికుల రిలే నిరాహారదీక్షా శిబిరం వద్ద భారీ నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగారావు పాల్గొంటారని తెలిపారు.

ఆశాల ముట్టడి సక్సెస్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

'ధర్నాకు వెళ్లితే.... ఉద్యోగాల నుండీ తొలగిస్తాం... ఉద్యోగమో, యూనియన్నో తేల్చుకోండి' అంటూ వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నుంచి జిల్లాస్థాయి అధికారులు సర్క్యులర్ జారీ చేశారు.. ఫోన్లలో బెదిరించారు.. అయినా ఆశాలు బెదరలేదు.. పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేసినా ఆశాల ముట్టడి కార్యక్రమానికి పెద్దఎత్తున విచ్చేశారు. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని డిఎంహెచ్ఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉన్నతాధికారుల నుంచి బెదిరింపులు వస్తూనే ఉన్నాయి.

ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం చిత్తూరులోని డిఎంహెచ్ఒ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆశాలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ ఆందోళన విరమించేది లేదని యూనియన్ జిల్లా నాయకులు కృష్ణవేణి, గంగ, పద్మ హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి టి.గంగ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, పని భారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, నాణ్యమైన సెల్‌ఫోన్స్ ఇవ్వాలని, మొబైల్ యాప్‌పై శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు వెంటనే అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, కె.సురేంద్రన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి అనేకమార్లు అర్జీలు ఇచ్చినా తాత్సారం చేయడం వల్లనే ధర్నాలు చేయాల్సి వస్తోందన్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సబబు కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడా గంగరాజు మాట్లాడుతూ ఆరోగ్యరంగంలో ప్రధానమైన పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం ఇప్పటికైనా పరిష్కరించాలన్నారు. ధర్నా అనంతరం డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇచ్చారు. డిఎంహెచ్ఒ స్పందిస్తూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు అనురాధ, పద్మ, నళిని, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

వసతి గృహాల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు చిత్తూర్ కలెక్టరేట్ కార్యాలయం దగ్గర విద్యార్థులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.శశికుమార్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ట్రంకుపెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు,కాస్మోటిక్ ఛార్జీలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లాకన్వీనర్ ప్రవీణ్ కుమార్, సూరి, చైతన్య పాల్గొన్నారు.

గ్రామగ్రామాన క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు

టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్‌లో అన్ని రకాల క్యాన్సర్లకు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామని, ప్రపంచంలోనే తొలిసారిగా తిరుపతి జిల్లాలో సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని, గ్రామగ్రామాన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి, జెఇఒ సదా భార్గవి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఉద్ఘాటించారు. అత్యాధునిక వైద్య వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 13-22 తేదీల్లో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈవో ఎవి ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ వల్ల దేశంలో ఏటా ఏడు లక్షల మంది చనిపోతున్నారని చెప్పారు. తొలిదశలోనే గుర్తిస్తే సరైన చికిత్స అందించి అధిగమించవచ్చని అన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో పండిస్తున్న ఉత్పత్తుల వల్ల ఆ అవశేషాలు మానవ శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ రావడానికి కారణం అవుతున్నాయన్నారు. ప్రాణాయామం, యోగాకు సంబంధించి శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం ఆచార్యుల చేత మరో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. గో ఆధారిత వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్‌ను దూరం చేయవచ్చన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచానికి పెద్ద ముప్పు కాబోతుందని, జిల్లా జనాభాలో 10 శాతం మంది క్యాన్సర్ వ్యాధిబారిన పడుతున్నట్లు ప్రాథమిక అంచనా ఉందన్నారు. జేఈవో మాట్లాడుతూ జిల్లాలో గూడూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి ప్రాంతాల్లో క్యాన్సర్ వ్యాధిని గుర్తించడానికి శాశ్వత కేంద్రాలను ఏర్పాటు చేయడానికి టీటీడీ నిర్ణయించిందన్నారు. తిరుపతిని క్యాన్సర్ రహిత జిల్లాగా తయారు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అనంతరం ఈవో, కలెక్టర్, జేఈవో ఈ కార్యక్రమానికి సంబంధించిన మాడ్యూల్స్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చరణ్ బి సింగ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రా రెడ్డి, స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా కార్యక్రమ నిర్వాహక అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, శ్రీ వేంకటేశ్వర వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

రూ.44.50కే సోనా మసూర బియ్యం : జేసీ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

సన్న బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసి

రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందించే బియ్యం, కందిపప్పును ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం డీఎస్ఓ.శంకరన్ తో కలసి చిత్తూరు పట్టణం చర్చి వీది నందు వినాయక, సెల్వం స్టోర్స్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ, చిత్తూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ వారి సౌజన్యముతో నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.140 లకే విక్రయించే కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జె సి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశం నిత్యవసర వస్తువులు బియ్యం, కందిపప్పు అధిక రేట్లు ఉన్నందున సామాన్య ప్రజల పై భారం పడకుండా అందుబాటులో ఉండేలా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్లు, ట్రేడర్స్ అసోసియేషన్లతో మాట్లాడి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ప్రభుత్వం ఆదేశాల మేరకు రైస్ మిల్లర్ల అసోసియేషన్స్, ట్రేడర్స్ తో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మార్కెట్లలో బియ్యం, కందిపప్పు అధిక రేట్లు ఉన్నందున ప్రజల కు సౌకర్యవంతమైన వస్తువులు బియ్యం, కందిపప్పు తక్కువ రేట్లకు అందించాలని ఉద్దేశంతో ఇప్పటికే జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కల్లూరు, చిత్తూరు, పలమనేరు, నగిరి కేంద్రాల్లో బియ్యం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి బియ్యం కేజీ రూ.44.50 లకె పంపిణి చేయడం జరుగుతున్నదని తెలిపారు. రాబోయే రోజుల్లో బైరెడ్డిపల్లి, వి.కోట, కుప్పం మండల కేంద్రాల్లోనూ బియ్యం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. బయట మార్కెట్లో కేజీ కందిపప్పు రూ. 160 ఉన్నందున ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చిత్తూరు పట్టణంలో చిత్తూరు జిల్లా చాంబర్ అఫ్ కామర్స్ సౌజన్యంతో వినాయక,సెల్వం స్టోర్స్ నందు కందిపప్పు కేజీ.రూ.140 ల కె పంపిణీ చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వినాయక, సెల్వం స్టోర్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కె మోడల్ స్కూలుపై డివైఈవో ఆగ్రహం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

బంగారుపాళ్యం ఆర్కే మోడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పై పలు ఫిర్యాదులు రావడంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు .ఈ మేరకు డివైఈవో చంద్రశేఖర్ ఆర్కే మోడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చేరుకుని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.. సరోజినీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పేరుతో లైసెన్స్ ఉండగా అనుమతి లేకుండా ఆర్కే మోడల్ ఇంగ్లీష్ పాఠశాల పేరుతో ఎలా నడుపుతారని ... ఇది చట్ట వ్యతిరేకమని వెంటనే పేరును మార్చాలని ఆదేశించారు అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందిందన్నారు.. ఎక్కడ అధిక ఫీజులు వసూలు చేయరాదన్నారు.. పాఠశాల నందు ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలని ఆదేశించారు.. పాఠశాల పై అందిన ఫిర్యాదులను ఉన్నతస్థాయి అధికారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఆర్కే మోడల్ పాఠశాల్లో విచారణ జరుపుతున్న డివైఈఒ

పాఠశాల యాజమాన్యం తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు.

గంజాయి సీజ్... ఇద్దరు అరెస్టు

చిత్తూరుఅర్బన్: పూతలపట్టు మండలం బండపల్లి సమీపంలో మంగళవారం వాహనాలు తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా గుర్తించిన వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 1.5 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వెంకటేష్, మోహన్ బాబులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. కేసు నమోదు చేసిన సీఐ కొట్టు శ్రీనివాస్, పూతలపట్టు పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ వెంకటేష్ ,సిబ్బంది పాల్గొన్నారు.

పురిటిబిడ్డలకు 'గిఫ్ట్‌బాక్సులు' : సిఐటియు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం పుట్టినరోజు పురస్కరించుకుని పుత్తూరు ప్రభుత్వాసుపత్రిలోని పురిటిబిడ్డలకు గిఫ్ట్‌బాక్సులను అందజేశారు. తన జన్మదినం పురస్కరించుకుని ప్రభుత్వాసుపత్రిలో పేదలకు అవసరమైన గిఫ్ట్‌బాక్సులను డాక్టర్ ఉదయ్ చేతుల మీదుగా అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్, ఎ.విజయ్, సుధాకర్, కృష్ణమూర్తినాయుడు, గోవింద్‌స్వామి, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం పుట్టినరోజు పురస్కరించుకుని...

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు': డిప్యూటీ సిఎం

చిత్తూరుఅర్బన్ : చిరువ్యాపారులకు, వీధి విక్రయదారులకు భరోసాగా, వారిని అప్పుల ఊబి నుండి కాపాడేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి జగనన్న తోడు కార్యక్రమం రూపొందించారని ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి పేర్కొన్నారు. వరుసగా నాలుగవ ఏడాదిలో మొదటి విడతగా జగనన్న తోడు ద్వారా లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో కంప్యూటరు బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వర్చువల్ విధానంలో ఉప ముఖ్యమంత్రి, చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, చిత్తూరు నగర పాలక మేయర్ అముదలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ జగనన్న తోడు పథకం ద్వారా ముఖ్యమంత్రి ఒక్కొక్క లబ్ధిదారునికి తన వ్యాపారానికి మూలధనంగా రూ.10వేల చొప్పున బ్యాంకుల ద్వారా అందించే కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఈ మొత్తాన్ని 12 కంతులలో వడ్డీతో తిరిగి బ్యాంక్ లకు సక్రమంగా చెల్లించిన వారికి తాము జమ చేసిన వడ్డీని తిరిగి లబ్ధిదారుల ఖాతాలలోకి ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. దీనితో పాటు ఈ బ్యాంక్ రుణాలను రెన్యువల్ చేసే క్రమంలో రూ.10వేలకు పైగా రుణం పొందే అవకాశం కల్పించారని తెలిపారు. జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 19,692 మంది లబ్ధిదారుల ఖాతాలకు బ్యాంకు రుణాల క్రింద రూ.21.21 కోట్లు, జగనన్న తోడు ద్వారా గతంలో రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 16,677 మందికి రూ.24.26 లక్షలు వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జగనన్నతోడు, వడ్డీ రీయింబర్స్మెంట్ లకు సంబంధించిన మెగా చెక్కును ఉప ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎం ఎల్ ఏ, నగరపాలక సంస్థ మేయర్ ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ శాంతి, జడ్పీ వైఎస్ చైర్మన్ రమ్య, జడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్మన్ భారతి, డి ఆర్ డి ఎ పిడి తులసి, ఎల్ డి ఎం హరీష్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి.

నిరుపేదలకు అండగా వైసీపీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కుప్పం: నిరుపేద కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కుప్పంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన వార్డు బాట కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్నది జగన్ ప్రభుత్వం అని, వైసీపీ సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చి దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అని తెలిపారు. చంద్రబాబు నాయుడు 35 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా గెలుస్తూ కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు అభివృద్ధి చేసి ఉంటే మాకు రోజూ వందల సంఖ్యలో సమస్యల అర్జీలు ఎందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లాకు అమూల్ డెయిరీని తీసుకు వచ్చి పాడి రైతులకు ఎంతో మేలు చేశారని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా విద్యా వ్యవస్థను అభివద్ధి చేసి ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో మంగళవారం ఎంఈవో లు సాయిలీల, బండ్ల సుబ్రహ్మణ్యం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా మధ్యాహ్న భోజనం సమయం అవడంతో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వారు తిని వంట సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పిల్లల హాజరు పరిశీలించి 354 మంది విద్యార్థులు మంగళవారం హాజరైనట్లుగా ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో గౌహార్ సుల్తాన్, ఉపాధ్యాయులు, సిఆర్పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: డాక్టర్ వైఎస్ఆర్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా జలారిపల్లిలో మంగళవారం డాక్టర్ విజయ్ చంద్ర ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పరీక్షలు చేయించుకుని, మంచి పోషకాహారం తీసుకోవాలని తద్వారా రక్తహీనతను నివారించి తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, టీచర్లు, ఏఎన్ఎం పద్మా, ఎర్రం రెడ్డి, ఆశ అమరావతి పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులు పాఠశాలల్లో చేరిక

ప్రత్యేక ప్రతిభావంతుడిని పాఠశాలలో చేర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలను సిడబ్ల్యూఎస్ కింద పలు పాఠశాలల్లో చేర్పించినట్టు ఎంఈఓ 2 శివరత్నమ్మ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు విద్య ఎంతో అవసరమని, తద్వారా వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం చిన్నారులను వారి వయసును బట్టి పాఠశాలల్లో చేర్పించే విధంగా ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఇప్పటివరకు 6 మంది ప్రత్యేక ప్రతిభావంతుల చిన్నారులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐఇఆర్టి సిబ్బంది గంగాధర్, రవీంద్ర, సిఆర్పి సోమశేఖర్, పాఠశాల, సచివాలయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఓటమి భయం

మాట్లాడుతున్న కుప్పం నియోజకవర్గ పరిశీలకులు ఖాదర్ భాష

ప్రజాశక్తి-రామకుప్పం: ఓటమి భయంతో వైసీపీ ప్రభుత్వ తెలుగు దేశం పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగిస్తూ, దొంగ ఓట్లను భారీగా ఎక్కిస్తున్నారని కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ భాష మంగళవారం వాపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చారని, ప్రతి నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని, అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, పేదవారు బతకలేని పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశం అంటుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మునిరత్నం, మనోహర్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల జీవితాలలో వెలుగులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు

పజాశక్తి-పుంగనూరు: చిరు వ్యాపారాలు చేసి జీవనం సాగిస్తున్న వారి జీవితాలలో వైసీపీ ప్రభుత్వం వెలుగులు నింపుతున్నదని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు అన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా వీధి విక్రయదారుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులను అభివద్ధి చేయడంలో భాగంగా రూ.10 వేలు వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకాన్ని అందరూ ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. పతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ మన ముఖ్యమంత్రి దేశంలోనే ఆదర్శమైన ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలవడం జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్ర విద్యుత్, భూగర్భ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వీధి వ్యాపారులకు సొంత నిధులతో సోలార్ లైట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెంచుపల్లి కష్ణప్ప, శంకరప్ప, గంగాధరం, లక్ష్మమ్మ, రామమ్మ, గీతమ్మ, కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-కార్వేటినగరం: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి లతాబాలాజీ అన్నారు. మంగళవారం కత్తెరపల్లి, కార్వేటినగరంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్పంచ్‌లు గుణావతి లోకనాథంనాయుడు, కుప్పయ్య, ధనంజయ వర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నిరుపేదల కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ఏర్పాటు చేసి ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేయడం ఓ వరమన్నారు. సీఎం పేదల కోసం ఎన్నో పథకాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సచివాలయాల వద్ద పైసా ఖర్చు లేకుండా ఫలాలు అందుతున్నాయన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ త్రిశల్, సర్పంచ్ ధనంజయ వర్మ ఆధ్వర్యంలో 398 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ మురళి, తహశీల్దార్ రవికుమార్ వర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి లక్ష్మి, మండల కో ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, లోకనాథం నాయుడు, వైస్ ఎంపీపీ కార్తీక్ రెడ్డి, ఎంపీటీసీ కమలమ్మ పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా భావిస్తుందని పీహెచ్‌సీ కమిటీ ఛైర్మన్ ఎస్ శివ ప్రకాష్ రాజు, జడ్పిటిసి సభ్యులు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్‌లు తెలిపారు. మంగళవారం బాలకృష్ణాపురం గ్రామ సచివాలయ పరిధిలో సర్పంచ్ సిబా, ఎంపీటీసీ లిఖిత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ప్రేమ్ రాజ్ కుమార్, ఏపీఎం పరిధి మస్తాన్, ఏవో ఢిల్లీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ దాము, నాయకులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటే గౌడ

పులిచెర్ల: జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని జడ్పిటిసి సభ్యులు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లి, కమ్మపల్లి సచివాలయాల్లో మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్. వెంకటే గౌడ అన్నారు. మంగళవారం లింగాపురం సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, మండల తహశీల్దార్ లోకేశ్వరరావు, జడ్పిటిసి సుష్మ కీర్తి, మండల కన్వీనర్ బాగా రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ ప్రహ్లాద, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్ర వద్ద మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభను మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో నిర్వహించారు. ఈ సందర్భంగా 394 మంది 11 రకాల ధ్రువపత్రాలు అవసరమని రిజిస్ట్రేషన్ చేసుకోగా గ్రామ సభలో 377 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్టు సర్పంచ్ భాషా మసూద్ తెలిపారు. కార్యక్రమంలో మెకానిక్ భాష, కార్యదర్శులు జయశంకర్, సుధాకర్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

ఉపాధి హామీలో రూ.9.79కోట్లు నిధుల ఖర్చు

సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలో 2022 ఏప్రిల్ 1 నుండి 2023 మార్చి 31వరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.9.79కోట్లు నిధులు ఖర్చు చేశారని జిల్లా డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. మంగళవారం గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో సామాజిక బందం చేసిన తనిఖీలో రోడ్డు పక్కన నాటిన మొక్కలు ఎండిపోవడం, కొన్నిచోట్ల పశువులు మేసేయడం జరిగిందని, గుట్టల్లో చేసిన మట్టి పనులు వర్షాల కారణంగా కొట్టుకుపోయినట్లు గుర్తించినట్లు, పనులు జరిగిన చోట వివరాలు తెలియజేసే బోర్డులు లేదని గుర్తించడాన్ని వాటిని తిరిగి ఏర్పాటు చేయాలని మండల ఉపాధి హామీ అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. మండలంలో 32 పంచాయతీలు ఉన్నప్పటికీ కూలీల సంఖ్య 1596 మంది కూలీలు ఉండటంపై, చిన్న చిన్న మండలాల్లోనే ఎక్కువ మంది కూలీలు పనిచేస్తున్నారని, అలాంటిది ఇక్కడ తక్కువ మంది కూలీలు ఉండటం భావ్యం కాదని, వారంలోపు కూలీల సంఖ్యను 3200 కు పెంచాలని ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిఒ భాగ్యలక్ష్మి, ఉపాధి క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీవో శ్రీదేవి, మండల ఉపాధి హామీ ఎపిఒ శ్రీనివాసులు, మండల వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ గౌడ్‌ను హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అమర్‌నాథ్ గౌడ్‌ను హత్య చేసిన వారిని శిక్షించాలని జిల్లా పార్లమెంట్ ఈడిగ బీసీ సాధికార సమితి కన్వీనర్ బుస నాగరాజు గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని నలగం పల్లి గ్రామంలో అమర్‌నాథ్ గౌడు సంతాప సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు ఇటీవల రేపల్లె నియోజకవర్గంలో హత్యకు గురైన అమర్‌నాథ్ గౌడ్‌కు నివాళులు అర్పించడం మన అందరి బాధ్యత అన్నారు. అమర్‌నాథ్ గౌడ్ సోదరిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నలుగురు వైసీపీ నేతలు అమానుషంగా ప్రవర్తించినందుకు అమర్‌నాథ్ గౌడ్ ఎదురించి ప్రశ్నిస్తే పెట్రోల్ పోసి కాల్చి చంపారు. హత్య జరిగి ఇన్ని రోజులు అవుతున్నా హంతకులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని, ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అందించి హంతకులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రెడ్డమ్మ, బంగారుపాళ్యం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బుస జనార్ధన్ గౌడ్, జిల్లా ఈడిగ బిసి సాధికార సమితి సభ్యులు రెడ్డప్ప, వెంకటేష్, బిసి నాయకులు చంద్రయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాజు పల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్ఆర్ పెట్టుబడి కార్యక్రమంలో భాగంగా పట్టుపురుగుల పెంపకంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టుపురుగుల పెంపకం శాస్త్రవేత్త వెంకటాచలపతి మాట్లాడుతూ రైతులు మల్బరీ తోట వేసే ముందు భూసార పరీక్ష చేయించి మల్బరీ తోట నాటాలని తెలిపారు. అదేవిధంగా పట్టుపురుగుల పెంపకం రోగ నివారణ చర్యలు, పట్టుపురుగులు పెంపకం గది నిర్వహణ, పట్టుగూళ్ల రవాణా చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పట్టుపురుగుల పెంపకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు అందిస్తుందన్నారు. ఎకరా మల్బరీ నాటుటకు రూ.18,750, షెడ్డు నిర్మాణానికి (20X35) రూ.2,25,000, (20X50) రూ.3 లక్షలతో షెడ్లు నిర్మించుకోవచ్చని అదేవిధంగా రైతులకు అవసరమైన పనిముట్లు, ఇతర అవసరాలకు రూ.3,700, రూ.56,250 లు ఇస్తుందని అన్నారు. రైతులు మల్బరీ తోటల పెంపకం పై దష్టి సారించి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కష్ణప్ప, రమణ, వైసీపీ నాయకులు శంకరరెడ్డి, టి.ఎ వెంకటరమణ, ఎఎస్ఓ జివిఆర్ చౌదరి, సెంట్రల్ సిల్క్ బోర్డు సెక్రటరీ వెంకటాచలపతి, రాజు పల్లి రైతు భరోసా కేంద్రం బాలాజీ, మండలంలోని విఎస్ఎ లు, పట్టు రైతులు పాల్గొన్నారు.

గంజాయిపై పలమనేరు పోలీసుల ఉక్కుపాదం

ప్రజాశక్తి-పలమనేరు: గంజాయిపై పలమనేరు పోలీసులు ఉక్కుపాదంతో పదిరోజుల వ్యవధిలో 12 కేసులు నమోదు చేసి 35 మంది నేరస్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద సుమారు 50 కేజీల గంజాయి, 2 మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకుని, 50 కేజీల గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం పట్టణ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వెనుక గంటవూరు సమీపంలో 2 కేసులు నమోదు చేసి 12 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి, 11.200 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆలయంలో అన్నదానం



ప్రజాశక్తి-నగరి: స్థానిక ఓంశక్తి ఆలయ 37వ వార్షికోత్సవం, 31వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఓంశక్తి ఆలయంలో మంగళవారం అభిషేక అర్చనలు, 1008 పుష్పార్చనలు, పంచముఖ దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయం వద్ద అన్నదానం, వస్త్రదానంతో పాటు జీవనోపాధి లేని కుటుంబాలకు ఆసరాగా చేతి పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ప్రచార కమిటీ అధ్యక్షులు టి.గంగాధర్, టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్ రమణ, కిషోర్ బాబు, దాతలు, ఉభయ దారులు పాల్గొన్నారు.

జగనన్న సంకల్పాన్ని నెరవేరుద్దాం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జగనన్న సంకల్పాన్ని నెరవేరుద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని బంగారుపాళ్యం 2 సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అభివద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని, ఇచ్చిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని వెదురుకుప్పం పంచాయతీ తంగేళ్ల మెట్ట, కొమరగుంట పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక సర్పంచ్ శిల్ప, ఎంపీటీసీ రాధికా పురంధర్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభివద్ధి చేయాలనే సంకల్పంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ఎన్నికలకు ముందు నవరత్నాలను ప్రవేశపెట్టి, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తూ వారి అభివద్ధికి తోడ్పడిన ప్రభుత్వం వైఎస్ఆర్ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం:

జిల్లా బాలికల క్రికెట్‌కు ఎంపిక

జిల్లా క్రికెట్‌కు ఎంపికైన కడపనత్తం జడ్పీ పాఠశాల విద్యార్థినులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అండర్ 19 జిల్లా బాలికల క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు క్రికెట్ కోచ్ చిరంజీవి మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఆదివారం తిరుపతిలోని వైఎస్ఆర్ గ్రౌండ్స్‌లో జిల్లా బాలికల క్రికెట్ జట్టు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడపనత్తం పాఠశాల నుండి హాజరైన విద్యార్థినులు రుచిత, రోహిణి, హేమలత, తేజశ్రీ విశేష ప్రతిభ కనపరచడంతో వారు జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఏసీఏ సౌత్ జోన్ అండర్ 19 బాలికల అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 21 నుండి 23వ తేదీల్లో వెంకటగిరి క్రీడా మైదానంలో జరగనున్నదని, ఈ పోటీల్లో ఎంపికైన బాలికలు పాల్గొంటారని ఆయన తెలిపారు. కడపనత్తం జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన 4 గురు విద్యార్థినులు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంతో గ్రామస్థులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బంగారుపాళ్యం మండలం ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మండలంలోని పీడీపై కండిగ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ బోధిస్తున్న ఉపాధ్యాయుడైన లక్ష్మీపతి, వేణులు గత నెలలో జరిగిన బదిలీలలో భాగంగా బదిలీ అయిన సందర్భంగా, గతంలో వారు ఏపీటీఎఫ్ సంఘ అభివద్ధికి ఎంతో కషి చేశారని, వారు చేసిన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ తరఫున దుశ్శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు గోపీనాథ్, మండల శాఖ అధ్యక్షులు రవి, కార్యకర్తలు వాసు, శంకర్, సాగర్, చిరంజీవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన

లబ్దిదారులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని బూరగమంద గ్రామ సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను, ఇతర సౌకర్యాలను వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాలు చేపడుతున్న వారిని సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, సిమెంటు రోడ్లు తదితర సౌకర్యాలను పూర్తిస్థాయిలో త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మ దేవాలయంలో ఆడిపూజలు

ప్రజాశక్తి-నగరి: నేత్రప్రదాత దేశమ్మ దేవాలయంలో ప్రతి ఏడాది ఎంతో వైభవంగా జరిగే ఆడినెల పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆడి పూజలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఆడి మంగళవారం అమ్మవారికి విశిష్టం కావడంతో భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులను నియంత్రించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకొని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయం వద్ద పలువురు భక్తులు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేరాలు.. ఘోరాలు

టీడిపి నేత శంకరప్ప మృతి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు, బందార్లపల్లి పంచాయతీ గడ్డురు గ్రామానికి చెందిన శంకరప్ప(56) మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ, మండల తెలుగుదేశం పార్టీ నేతలు మునస్వామి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రామమూర్తి, సుబ్రి, మనోహర్ తదితరులు సంతాపం తెలిపారు.

చిరుత దాడిలో లేగ దూడలు..

మృతి చెందిన లేగ దూడ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: చిరుత దాడిలో లేగ దూడలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు... మండలంలోని గౌనితిమ్మేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మునేని చెరువు ఎర్రచన్లు పరిధిలో ఉన్న ఆవుల కొట్టాలపై సోమవారం రాత్రి చిరుత దాడి చేసి రైతులు లతీఫ్, లక్ష్మప్పల లేగదూడల గొంతు కొరికి రక్తం తాగి విధ్వంసం సృష్టించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చిరుత పులి భయానికి బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చిరుత పులి గ్రామంలోకి రాకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

పేకాట ఆడుతున్న వారిచుట్టూ నిలబడ్డ పోలీసులు

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని అమ్మగారి పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో అయ్యగారి చెరువు సమీపంలోని చెట్టు కింద మంగళవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఎస్సై మారుతి పేకాట స్థావరంపై దాడి చేశారు. దీంతో పోలీసులను చూసి నలుగురు పారిపోగా ఆరుగురు సంఘటనా స్థలంలో పట్టుబడ్డారు. అనంతరం వారి వద్ద నుండి రూ.93,150 లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తండ్రీకుమారులపై కేసు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ముక్కళత్తూరు దళిత వాడకు చెందిన ఓ యువతి పట్ల అదే దళిత వాడకు చెందిన తండ్రి, కుమారులు అసభ్యంగా ప్రవర్తించారని కేసు నమోదైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు వివరాలు... గంగాధర నెల్లూరు మండలంలోని ముక్కళత్తూరు దళిత వాడకు చెందిన ఓ యువతి పట్ల, అదే దళిత వాడకు చెందిన వెంకటేష్ (తండ్రి), కుమారులు వినోద్ కుమార్, ఉదయ్ కుమార్‌లు అసభ్యకరంగా ప్రవర్తించారని ఫిర్యాదు చేశారని ఈ మేరకు విచారణ చేసి, ఆ ముగ్గురిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వజ్రాల పేరిట మోసానికి యత్నం

మోసగించడానికి ఉపయోగించిన నకిలీ వజ్రాలు

ప్రజాశక్తి-పలమనేరు: నకిలీ వజ్రాల పేరిట మోసం చేయడానికి యత్నిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన సంఘటన పలమనేరు రూరల్ మండలంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు...రూరల్ మండలం ఎం.కోటూరు గ్రామానికి చెందిన చంద్రకుమార్(డేవిడ్), పందేరి పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు తక్కువ ధరకు వజ్రాలు ఇస్తామని మంగళవారం ఎం కోటూరు గ్రామానికి చెందిన కష్ణయ్య గౌడ్‌ను నమ్మించే ప్రయత్నం చేశారు. మూడు పెద్దవి, 12 చిన్నవి ఉన్నాయని రూ.20 లక్షలు విలువ చేసే వజ్రాలను అతి తక్కువకు రూ.10 లక్షలు ఇస్తే చాలని నమ్మ పలకడం జరిగిందన్నారు. అవి నకిలీవని పసిగట్టిన కష్ణయ్య గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనపై పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-సోమల: మండలంలోని తమ్మినాయుడు పల్లి పంచాయతీ పి చెరుకువారి పల్లి గ్రామంలో నల్లేరు రెడ్డప్ప (49) అనారోగ్యంతో మంగళవారం మతి చెందాడు. దీంతో వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేలు తక్షణ సహాయాన్ని సర్పంచి సురేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, గ్రామస్తులు అందజేశారు. మృతుని భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో మృతుని కుమార్తె రెడ్డి లక్ష్మి (10) 6వ తరగతి చదువుతోంది. చిన్నారికి అయినవారు లేక అనాథగా మారాల్సిన పరిస్థితి ఏర్పడటంతో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు చిన్నారి పరిస్థితిని గుర్తించి తను ఉన్నత చదువులు చదివే విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి గ్రామానికి చెందిన కాశి గౌండర్ కుమారుడు శివ కుమార్ హఠాత్తుగా మంగళవారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో జగనన్న బీమా పథకం ద్వారా అత్యవసరానికి రూ.10 వేలు మృతుని భార్య కన్యక కు స్థానిక నాయకులు అందించారు. మిగిలిన రూ.90 వేలు ఆమె ఖాతాలోకి ప్రభుత్వం జమ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కార్తికేయన్, సర్పంచ్ ముంతాజ్, చక్రవర్తి, కోటయ్య, ధనంజయ, బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న నాయకులు